# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**MAY - 2015**

సంవత్సర చందా రూ. 50/-

# క్రీస్తు సంఘములు నిర్వహించు

# రక్షణ సువార్త సభలు

తేదీలు : **2015 మే నెల 26, 27, 28,**

**మంగళ, బుధ, గురువారములు**

**ప్రతి సాయంత్రం 6.00 గం॥ల నుండి ప్రారంభం**

స్థలము : **మెక్లారిన్ హైస్కూలు గ్రౌండ్స్**

**కాకినాడ**

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం

బ్రదర్ టి.వి.శ్యాంసన్ రాజ్

బ్రదర్ కె.జి. కుమార్

బ్రదర్ యమ్. సామ్యూల్ రాజు

బ్రదర్ టి. ప్రసన్న విజయ కుమార్

బ్రదర్ యమ్. సూర్యారావు

మీరందరు ప్రార్థన పూర్వకముగా రండి. దైవాశీస్సులను మెండుగా పొందండి. దూరప్రాంత్రముల వారికి ఉచిత వసతి కలదు. వివరములకు దిగువ నెంబర్లకు ఫోన్ చేయండి.

**98665 28791 / 99631 86457 / 98669 03278**

నిర్వాహకులు : సహో కె. మోజెస్, యస్. ప్రభాకర్,

అబ్రహాంలింకన్ మరియు పి.బలరామ్

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 35 | మే - 2015 | సంచిక - 10

## ఆశ్చర్యకరుడైన క్రీస్తు
(The Wonderful Christ)

క్రీస్తు పుట్టుక 700 సంవత్సరములకు ముందు ఆయనను గూర్చి యెషయా ప్రవక్త ఇట్లు ప్రవచించెను: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి యని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6). యెషయా ప్రవచించిన ఆశ్చర్యకరుడైన యేసుక్రీస్తు యొక్క వ్యక్తిత్వమును గూర్చి, ఆయన క్రియలను గూర్చి ఈరోజు మనము కొంత తెలుసుకొందుము.

యేసుక్రీస్తు ఆశ్చర్యకరుడు. మరియే మానవుడు ఎన్నడు జన్మించని రీతిగా ఆయన ఈలోకమందు జన్మించెను. ఆయన దేవుని ప్రభావము వలన కన్యయైన మరియకు జన్మించెను. క్రీస్తుకు భూసంబంధమైన తండ్రిలేడు. దేవుడే ఆయనకు తండ్రి అందువలననే యేసుక్రీస్తు దేవుని అద్వితీయకుమారుడై యున్నారు. ఆయన ఆశ్చర్యకరుడు. ఏలయనగా ఆయన దైవ మానవునిగాను, మానవ

దేవునిగాను ఉండెను. ఆయన దేవుని కుమారుడేగాక మనుష్య కుమారుడుగా కూడ ఉండెను. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు ఆయనను గూర్చి ఒప్పుకొనెను (మత్తయి 16:16). ఆయన అయితే నేను మనుష్యకుమారుడనని చెప్పుకొనెను: "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచనక్రయ ధనముగా తన ప్రాణమును ఇచ్చుటకును వచ్చెను" అని తనను గూర్చి క్రీస్తు చెప్పుకొనెను (మార్కు 10:45).

క్రీస్తుకు ఆశ్చర్యకరమైన శక్తి ఉండెను. ఏలయనగా దేవుడు తాను పంపినవానికి కొలతలేకుండ ఆత్మనను గ్రహించెను. యేసు గ్రుడ్డివారిని బాగు చేసెను. యేసును, ఆయన శిష్యులును బేత్సయిదాకు వచ్చిరి. "అప్పుడు అక్కడ వారు ఆయన యొద్దకు ఒక గ్రుడ్డివానిని తోడుకొనివచ్చి, వానిని ముట్టవలెనని ఆయనను వేడుకొనిరి. ఆయన గ్రుడ్డివాని చెయ్యిపట్టుకొని ఊరు వెలుపలికి తోడుకొనిపోయి, వాని కన్నుల మీద ఉమ్మివేసి వానిమీద చేతులుంచి, నీ కేమైనను కనబడుచున్నదా? అని వాని నడుగగా, వాడు కన్నులెత్తి మనుష్యులు నాకు కనబడుచున్నారు: వారు చెట్ల వలెనుండి నడుచుచున్నట్లుగా నాకు కనబడుచున్నారు : అంతట ఆయన మరల తనచేతులు వాని కన్నులమీద నుంచగా వాడు తేరిచూచి కుదర్చబడి సమస్తమును తేటగా చూడసాగెను'' (మార్కు 8:22-25). యేసు చనిపోయిన వారిని ప్రాణముతో లేవదీసెను. సమాజ మందిరపు అధికారియైన యాయీరను నతని పండ్రెండు సంవత్సరముల ప్రాయము గల కుమార్తె చనిపోయెను, యేసు ఆ చిన్నదాని తల్లిదండ్రులను, తనతో ఉన్నవారిని వెంటబెట్టుకొని, ఆ చిన్నది పరుండియున్నగదిలోనికి వెళ్ళి ఆ చిన్నదాని చేయి పట్టి, చిన్నదానా, లెమ్మని చెప్పెను. వెంటనే ఆ చిన్నది లేచి చిన్న దోనెలో ప్రయాణము చేయుచుండగా పెద్ద తుఫాను రేగెను. అప్పుడాయన లేచిగాలిని గద్దించి, నిశ్శబ్దమై ఊరకుండు మని సముద్రముతో చెప్పగా, గాలి అణిగి, మిక్కిలి నిమ్మళమాయెను. ఆయన శిష్యులు మిక్కిలి భయపడి ఈయన ఎవరో, గాలియు, సముద్రమును ఈయనకు లోబడుచున్నవని యొకనితో నొకడు చెప్పుకొనిరి (మార్కు 4:35-41). అవును, యేసు ఆశ్చర్యకరుడు, ఆయన తన ఆశ్చర్యశక్తిని అనేకసారులు ప్రజలయెదుట బయలు పరచెను. ఆయన అనేక అద్భుతములు, మహత్కార్యములు చేసెను. అవన్నియును వ్రాయబడవలెనన్న

భూలోకమందున్న గ్రంధములన్నియును చాలవు. అయితే కొన్నిమాత్రమే క్రొత్త నిబంధనలో వ్రాయబడెను. "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును అవి వ్రాయబడెను" అని యోహాను వ్రాసెను (యోహాను 20:30,31).

యేసు ఆశ్యర్యకరమైన మాటలను పలికెను. "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు. నీతికొరకు ఆకలి దప్పులుగలవారు ధన్యులు వారు తృప్తిపరచబడుదురు. కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు. నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" అని యేసు బోధించెను (మత్తయి 5:3-10). "ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి. ఆహారముకంటె ప్రాణమును, వస్త్రము కంటే దేహమును గొప్పవికావా?" "కాబట్టి–ఏమితిందుమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి అన్యజనులు వీటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" అని యేసు బోధించెను (మత్తయి 6:25-34). "యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలెకాక అధికారము గల వానివలె వారికి బోధించెను" (మత్తయి 7:28-29).

యేసుక్రీస్తు ఆశ్చర్యకమైన అధికారము కలిగియుండెను. ఆయన బోధించునప్పుడు అధికారము గల వానివలె బోధించెను. ప్రకృతి శక్తులు ఆయన అధికారమునకు లోబడెను; అపవిత్రాత్మలు ఆయన అధికారమునకు భయపడి ఆయనకు లొంగెను. చివరకు మృత్యువును కూడ ఆయన లోబరచుకొనెను. ఆయన చనిపోయి వారికి తిరిగి ప్రాణమును పోయుటయేగాక, ఆయనే చనిపోయి తిరిగిలేచెను. ఇది ఎంత ఆశ్చర్యమో! ఆయన మృత్యుంజయుడై లేచిన తరువాత, "పరలోక మందును భూమి మీదను

నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగాచేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చును, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని తన అపొస్తలుల నాజ్ఞాపించెను (మత్తయి 28:18-20).

యేసుక్రీస్తు ఇప్పుడు పరలోక మందు ఒక ఆశ్చర్యకరమైన స్థానమును కలిగియున్నారు, ఆయన పునరుత్థానుడైన తరువాత పరలోకమునకు ఆరోహణు డాయెను. దాని విషయమై పేతురు యిట్లుసాక్ష్యము పలికెను: "క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను. ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము. కాగా ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింప బడెను. మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశ మంతయు రూఢిగా తెలిసుకొనవలెను" (అపో.కా.2 : 31-36). "ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు" అని అపో.పౌలు హెబ్రీ 12:2లో వ్రాసెను.

యేసుక్రీస్తు మరల రాబోవు చున్నారు. ఆయన మొదటిసారి వచ్చిన పుడు పాపులను రక్షించుటకు వచ్చెను. ఆయన రెండవసారి వచ్చునప్పుడు పాపులకు తీర్పుతీర్చుటకు వచ్చును. ఇందు విషయమై దైవవేదము ఇట్లు బోధించుచున్నది. "తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయు బడుదురు. గొల్లవాడు మేకలలో నుండి గొర్రెలను వేరు పరచునట్లు ఆయన వారిని వేరుపరచి తన కుడివైపున గొర్రెలను, ఎడమవైపున మేకలను నిలబెట్టును. అప్పుడు రాజు కుడివైపున ఉన్నవారిని చూచి -నా తండ్రి చేత ఆశీర్వదించబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని చెప్పును. ఆయన ఎడమవైపున ఉందు వారిని చూచి - శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతల కును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి

పోవుడి అని చెప్పును. వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు". మత్తయి 25:31-46 వరకు దయచేసి చదవండి.

యేసుక్రీస్తు ఆశ్చర్యకరుడని ఈ దినము మనము గ్రహించితిమి. ఆయన యిచ్చు నిత్యజీవములో ప్రవేశింపవలెనంటె ఆశ్చర్యకరుడైన యేసునందు విశ్వాసముంచండి. మీ పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి. అట్లుచేసి ఆయన సంఘమందు ప్రవేశించి ఆశ్చర్యకరమైన క్రైస్తవ సహవాసములో పాలుపొందుడి!

## దహన బలి యొక్క సంస్కారము
## (The Ritual of the Burnt Offering)

### దేవుని బల్యర్పణ పద్ధతి -8

దహనబలిలో యున్న రూపకమును యేసు ప్రభువు ఎట్లు నెరవేర్చారో మనము తెలిసికొనబోవుచున్నాము. క్రైస్తవునికి ఈ దహన బలియర్పణలో యున్న కొన్ని పాఠములను కూడ గమనింతము.

దహనబలి మొదటి దశలో ఆరాధకుడు తన్నుతాను దేవునికి అర్పణగా అర్పించుకొంటాడు, అదే సందర్భములో తనకు బదులు తాను తెచ్చిన పశువును దేవునికి సమర్పించుకొంటాడు. ఆక్షణం నుండి ఆజంతువు దేవునికే చెందును.

రెండవదశలో ఆరాధకుడు తన చేతిని బలిపశువుతలపై ఉంచుతాడు. ఇంకొకమాటలో తనపాపములన్నిటిని ఆపశువు తలమీద మోపుతాడు. యిది అలంకారప్రాయముగా జరిగే బదిలీయే, గాని వాస్తవము కాదు. ఏలయనగా ఎడ్లయొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము అని హెబ్రీ 10:4 మనకు చెప్పుచున్నది.

మూడవదశలో ఆరాధకుడుతాను తెచ్చిన బలిపశువును తానేవధించాలి. ఈ రీతిగా పాపము యెడల దేవుని తీర్పును అతడు అంగీకరించును.

**రక్తప్రోక్షణ :**

ఇప్పుడు నాల్గవదశలోనికి మనము వెళ్లుచున్నాము. ఆరాధకుడు తాను చేయగలిగినదంతా చేసాడు. ఇప్పుడు యాజకుడు ప్రవేశించి పాపపరిహారార్థము నిమిత్తము మిగిలిన ఆచార కర్మలను పూర్తి చేయాలని అతడు తలంచును. పశువు యొక్క రక్తమును యాజకుడేబలి పీఠము చుట్టు ప్రోక్షించును. పాపపరిహారార్థము అతనికి బదులుగా అర్పింపబడిన పశువు

మీదను, యాజకుని మీదను ఈ ఆరాధకుడు ఆధారపడి యుండును.

క్రైస్తవులమైన మనము విశ్వాస మూలమున సిలువపై వ్రేలాడు యేసు క్రీస్తుపై చేతులుంచి మనపాపములను ఆయన మీద మోపుదుము. మన బలిగాయున్న ఆయనపై ఆధారపడి, పాపపరిహార కార్యక్రమమును జరిగించ వలసినదని యాజకునిపై ఆధారపడి యున్నాము. దేవుని సన్నిధిలో తన పరి శుద్ధ రక్తమును ప్రోక్షించి మన పాపపరి హారమును సంపూర్తి చేయునట్లు మనం ఆయనపై ఆధారపడియున్నాము.

**మన పాపములు యేసును సిలువవేసెను:**

ఆత్మీయ దృక్కోణంలో చూస్తే నిజానికి యేసు క్రీస్తు యొక్క మరణ మునకు మనమే బాధ్యులము. పాపము యెడల యేసు క్రీస్తులో దేవుని తీర్పును మనం అంగీకరించాలి. పిలాతుయొక్క ఆవరణలో నిలబడి ఆయనను "సిలువ వేయుము, సిలువ వేయుము" అని అరచిన గుంపులో కూడ మనం ఉన్నాము. ఎందువలననగా మన పాపముల యొక్క ఘోరతత్వమును బట్టి, దేవుని ఏకైక కుమారుడైన యేసుక్రీస్తు సిలువపై బలిగా అర్పింప బడవలసి వచ్చెను. నిజానికి మన పాపములే యేసును సిలువకుమేకులతో బంధించెను.

**రక్తప్రోక్షణ :**

ఆయాబలులలో రక్తప్రోక్షణ, అర్పించబడే బలియొక్క ప్రాధాన్యత మీద ఆధారపడి యుండును. కొన్ని బలులలో అతి పరిశుద్ధ స్థలములో యున్న కరుణా పీఠముపై రక్తము చిలకరింపబడును. అట్టిబలిలో పాపపరిహారము ముఖ్యమై యున్నది. దేవుడు క్షమించే అధికారి గనుక యిట్టి సన్నిహిత సంబంధము అవుసరము. పాపపరిహార దినమున పరిశుద్ధస్థలములోనికి రక్తము కొనిపో బడును.

అయితే దహనబలిలోను, సమాధాన బలిలోను, అపరాధపరిహారర్థ బలిలోను పాపక్షమాపణ స్వల్పమే. ఏలయనగా ఆబలులలో కొన్ని దశలు హెచ్చుస్థాయిలో అగుపడును. పాప క్షమాపణకంటె ఆరాధకుడు దేవునికి సమర్పించుకొనుట, ప్రతిష్ఠించుకొనుట వాటిలో ప్రాముఖ్యము.

యాజకుడు రక్తమును బలిపీఠము చుట్టు ప్రోక్షించును. ప్రత్యక్షగుడారము యొక్క ఆవరణములో బలిపీఠము దిగువ భాగమందు రక్తము చిలకరింపబడును. కొన్ని అర్పణలలో రక్తము బలిపీఠము అంచులకు ప్రోక్షింపబడినప్పుడు విమోచన ఆ బలి యొక్క ముఖ్య ఉద్దేశ్యము కాదు. పాపపరిహార దినమున, రక్షప్రోక్షణ పాముఖ్యము ఏలయనగా పాపవిమోచన,

క్షమాపణ దానిలో ముఖ్యము. అయితే దహనబలిలో అదిముఖ్యము కాదు. గనుక బలిపీఠము దిగువభాగములలో రక్తము ప్రోక్షింపబడును. అది అన్ని ప్రక్కల చల్లబడును.

రక్తము అట్లు చిలకరింపబడుటకు గల కారణము నిర్గమ 20:24లో చెప్పబడి యున్నది. దహన బలిపీఠమును నిర్మించ వలెనని దేవుడు తన ప్రజలతో చెప్పెను; "అక్కడ నేను నీ యొద్దకు వచ్చి నిన్ను ఆశీర్వదింతునని" ఆయన చెప్పెను. పాపక్షమాపణ, విమోచనయే ఆయాశీర్వా దము. రక్తమును వినియోగించుటలో పాపపరిహారము ఇమిడియున్నదనునది విదితమే.

**రక్తములో ప్రాణము :**

రక్తము ప్రాణమునకు గురుతు, "రక్తము దేహమునకు ప్రాణము, మీనిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలి పీఠము మీద పోయుటకై దానిని మీ కిచ్చితిని. రక్తము దానిలోనున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును" (లేవీ 17:11). ప్రాణము అర్పించబడినందున ప్రాయశ్చిత్తము జరుగును, అంగీకరించబడును. పస్కా గొర్రెపిల్ల వధింపబడినప్పుడు ఇశ్రాయేలీ యులుదాని రక్తమును వారి ద్వారబంధ ముల మీద ప్రోక్షింపవలెను. "మీరున్న ఇండ్లమీద అరక్తము మీకు గురుతుగా యుండును. నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింప జేయక దాటి పోయెదనని" యెహోవా ఇశ్రాయేలీ యులకు తెలియజెప్పెను (నిర్గమ 12:13). గనుక దహన బలిలో కూడ అదే భావము ఇమిడి యున్నది. "నేను ఆ రక్తమును చూచినప్పుడు మిమ్మును దాటి పోయెదను".

**పశు చర్మము ఒలుచుట:**

ఈ దహన బలి అర్పణలో తదుపరి దశను ఇప్పుడు గమనిం చుదము. రక్తము ప్రోక్షించిన తరువాత యాజకుడు బలి రూపమైన ఆపశు చర్మమును ఒలుచును. చర్మము ఒలువని అర్పణ ఒకే ఒక్కటి యున్నది. అది ఎఱ్ఱని పెయ్యేలు అర్పణ. అది పాళెముకు వెలుపల బలిగా అర్పింప బడును గాని దహన బలిపీఠము మీద కాదు. చర్మముతో సహా అంతా అది కాల్చబడును. దాని బూడిద బలి సంబంధమైన అపవిత్రతను తొలగిం చుటకుపయోగింపబడును.

దహనబలి పశువు యొక్క చర్మము ఎందుకు ఒలువబడవలెను యను దానిపై అనేక వివరములు ప్రజల యిత్తురు. దేవుడు ఆదాము హవ్వలకు మొదట చర్మము చొక్కాయిలను తొడిగినప్పుడాయన పశువు యొక్క చర్మమును ఒలిచెను గదా. దానికి దీనికి

ఏదో సారూప్యమున్నదని కొందరు చెప్పుదురు. అయితే దహన బలి విషయములో చర్మము అపరాధికి ఇయ్యబడదు, గాని అదియాజకునికి ఇయ్యబడును: "యాజకుడు అర్పించిన దహన బలిపశువు చర్మము అతనికి" (లేవీ 7:8).

మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడాయన తన నీతి వస్త్రము లతో మనలను కప్పునను దానికి దిసా దృశ్యమని మరి కొందరు చెప్పుదురు (గలతీ 3:27). మరల ఇక్కడ కూడ పాపికాదు గాని యాజకుడు ఆచర్మమును పొందును. నిజానికి ఆ బలిపశువు బలిపీఠముపై కాల్చబడాలి. చర్మముతోనే దాని కాల్చిన యెడల దేవాలయ ప్రాంగణమంతయు దుర్గంధముతో నిండియుండును గనుక చర్మమును వేరుచేసి దహనబలి పశువును దహిం చుట జరుగును.

**నిబంధనను నూతనపరచుట :**

ఆరవ దశలో బలిపశువు రెండు ప్రత్యేకభాగములుగా చేయబడును. యాజకుడు దాని అవయవములను సరిగ్గా మధ్యలో విడదీయును. హెబ్రీ యులు ఏదైనా నిబంధనచేస్తే వారొక పశువునో పక్షినో మధ్యకు విడదీసి నిబంధన చేసికొందురు. ఆదికాండము 15:9-18లో అబ్రాహాము, దేవుని మధ్య ఇట్టి నిబంధన జరిగెను. దహనబలి విషయంలోనైతే ఆరాధించేవాడు అప్పటికీ దేవునితో నిబంధన సంబంధము కలిగి యున్నాడు. గనుక అతడా సంబంధము ను నూతన పరచుకొనుటకు ఇయ్యబడిన తరుణమిది.

**బలిపశువు శరీరమును కడుగుట :**

ఏడవ దశలో యాజకుడు ఆ పశువు శరీరమును నీళ్లతో కడుగును. దానిపైనున్న రక్తమంతయు పోయేవరకు దానిని కడుగును ఏలయనగా బలిపీఠము పై రక్తము దహింపవలదు. అది బలిపీఠము దిగువభాగమున ప్రోక్షింప బడవలెను. దహింపబడిన దంతయు దిగువ భాగమున ప్రోక్షింప బడవలెను. దహింపబడిన దంతయు యెహోవాకు యింపైన సువాసనగా పైకి లేచి వెళ్లును.

**బలిపశువును దహించుట :**

ఎనిమిదవ దశ అర్పణకు కేంద్ర మైనది. బలి పశువు యొక్క శరీరమును, తలను, క్రొవ్వును బలిపీఠము మీదనున్న అగ్నిమీది కట్టెలపై చక్కగా పేర్చి యాజకులు దానిని దహింతురు (లేవీ 1:7-9). అదంతయు దహింపబడు చుండగా యెహోవాకు యింపైన సువాసనగా యుండును. ఇదంతయు జరుగుచుండగా ఆరాధించువాడు గమనించుచునే యుండును. మానసి

కంగా, వ్యక్తిగతంగా, భక్తిపూర్వకముగా దీనియంతటిలోను అతడు పాలి భాగస్థుడై అర్పించబడే వాడు తానేగాని, ఆ బలిపశువుకాదు అని భావించును. ఇంకొక మాటలో తనకు బదులుగా ఆబలిపశువునతడు అర్పించాడు

**క్రీస్తే మన దహనబలి :**

దహన బలి నిజానికి యేసుక్రీస్తు యొక్క బలికి సుచనగా యున్నది. సిలువపైనున్న క్రీస్తు దహనబలికి గురుతుగా లేరని మనం గ్రహించాలి. కల్వరి ఒక పాపయాగము. అది దహన బలియాగము కాదు. గనుక యేసు క్రీస్తు జీవితమంతయు, తనకు తాను దేవునికి పూర్తిగా సమర్పించుకొని నందున, ఆయన జీవితమంతయు ఒక గొప్ప దహన బలియాయెను !!.

**ఛాయనుండి నిజస్వరూపముకు :**

యేసుక్రీస్తు దహన బలియొక్క నెరవేర్పుని ఆబలిలోయున్న రూపకమును బట్టి మనం భావార్థము చెప్పవచ్చును. పాతనిబంధనలోని ఛాయ క్రొత్త నిబంధనలోని నిజస్వరూపముకు సరిసమానముగ యుండవలెను. "ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆవస్తువుల నిజ స్వరూపము గలది కాదు గనుక ఆయాజకులు ఏటేట ఎడతేగకుండ అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చు వారికి ఎన్నడు సంపూర్ణ సిద్ధికలుగ జేయనేరవు" (హెబ్రీ 10:1).

యేసుక్రీస్తు అర్పించబడు చుయున్న దహనబలియని సూచించు అనేక లేఖనభాగములు క్రొత్తనిబంధన యందున్నవి. మత్తయి 3:17లో దేవుడు యేసునుగూర్చి "ఈయన నాప్రియకుమారుడు, ఈయన యందు నేనాదించుచున్నాను" అని పలికెను. మరల రూపాంతరపు కొండపై "ఈయన యందు నేనాందించు చున్నానని" ఆయన పలికెను (మత్తయి 17:5). "ఆనందించుచున్నానను" పదములు ఇంపైన సువాసనకు సమానాంతరములు.

**యేసు ప్రభువుతన్నుతాను ప్రతిష్ఠించుకొన్నారు :**

"నాచిత్తము కాదు, నీచిత్తమే సిద్ధించును గాక!". యేసుప్రభువు యొక్క జీవితమంతయు దేవునికి సంపూర్ణముగా సమర్పించు కొనిన జీవితవే. యోహాను 17:19లో "అపొస్తలులును సత్యమందు ప్రతిష్ఠ చేయబడునట్లు వారికొరకై నన్ను ప్రతిష్ఠచేసికొనుచున్నానని" ఆయన తండ్రికి ప్రార్థించెను.

"కావున మీరు ప్రియమైన పిల్లల వలె దేవుని పోలినడుచుకొనుడి,

క్రీస్తు మిమ్మును ప్రేమించి పరిమళ వాసనగా ఉండుటకు మన కొరకు తన్నుతాను అప్పగించుకొనెను" అని ఎఫెసీ 5:1- 2 లో వ్రాయబడి యున్నది. యేసుక్రీస్తు దేవునికి యింపైన సువాసనగా యుండు నిమిత్తము సహనబలిగా తన్ను తాను అర్పించుకొనెనని ఈ లేఖనము తెలియజే యుచున్నది.

**బలిపీఠముపై 32 సంవత్సరములు :**

నిజానికి యేసుక్రీస్తు యొక్కదహన బలియర్పణ 32 సంవత్సరములమట్టుకు ఎడతెగకుండ కొనసాగెను, అందువలన ాయన ఒక మచ్చలేని గొర్రెపిల్ల వలె పాపపరిహారార్థబలిగా సిలువపై అర్పించ బడెను. ఆ బలిపీఠముపై అగ్ని ఎన్నడు ఆరిపోకుండ ఆయన కొనసాగించెను. హెబ్రీ 10:5-8 వచనాలలలో యేసు ప్రభువు తన్నుతాను బలిగా అర్పించు కొనుటకు వచ్చెనని ప్రవచనపూర్వక నెరవేర్పు వ్రాయబడి యున్నది (క్రీర్తన 6:8). యేసు ప్రభువు యొక్క జీవిత మంతయు ఛాయ రూపకముగా యున్న దహనబలి యొక్క నిజస్వరూపము, నెరవేర్పు అయ్యున్నది.

**మనము సజీవయాగముగా ఉండాలి :**

క్రైస్తవులు ఎడతెగని దహన బలులు అర్పింతురా? ఆత్మీయముగా అవును! మనము క్రీస్తును పోలినడు చుకోవాలి (ఎఫెసీ 5:1-2). క్రీస్తు మనలను ప్రేమించి పరిమళ వాసనగా యుండుటకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అర్పించు కొనెను. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అను కూలము నైన సజీవ యాగముగా మీశరీరము లను ఆయనకు సమర్పించుకొనుడి" (రోమా 12 : 1). 'అనుకూలమునైన యాగముగా సమర్పించుకొనుడి" అను మాట గ్రీకు భాషలో ఇంపైన సువాసనగా అర్పించకొనుడియని వున్నది. యిది క్రైస్తవుని ఆత్మీయ ఆరాధన. క్రైస్తవులు క్రీస్తును అనుక రించి తమ జీవితాన్ని దేవునికి సంపూ ర్ణముగా సమర్పించు కోవాలి. యేసు క్రీస్తు తన జీవితం ద్వారా దహన బలిఛాయను నెరవేర్చి ఎట్లు దాని నిజస్వరూపమయ్యారో క్రైస్తవులు కూడ సంపూర్ణ సమర్పణతో క్రీస్తును అనుకరింస్తు సజీవయాగముగా తమ్మునుతాము దేవుకి సమర్పించు కోవాలి

# దేవుని వాక్యము
## (The word of God)

లేఖనముల నిచ్చుట ద్వారా దేవుడు మానవ జాతిని నిజముగా దీవించారు. ప్రతివాడు దీనిని గుర్తించి దేవునికి కృతజ్ఞత చెల్లించుట యుక్తము. వాటిని ధ్యానించి, వాటి ప్రకారము జీవించుట ఎంతో మేలు. మానవుడు ఎంత గొప్ప తెలివిగలవాడైనను సరే దేవుని వాక్యబయల్పాటు అక్కరలేనివాడు కాజాలడు.

ఈలోకం ఎరిగిన వాటిలో బైబిలు అత్యంత గొప్ప గ్రంథము. దానికి అనేక కారణములున్నవి. అనేక శతాబ్ధాలుగా వ్రాయబడియున్న గ్రంధముల సంపుటి అది. అయినను అది ఎప్పుడు కాలానికి అనుగుణంగానే యుంటాది. అన్ని కాలములలోను ప్రయోజనకరమైన గ్రంధము అది. దానికున్న శత్రువుల నేకులు గాని వారందరినీ మించి అది జీవించుచునే యున్నది. ప్రతి యుద్ధము లోను అది విజయాన్ని సాధిస్తునే యున్నది. ప్రతి సంవత్సరము విరివిగా అమ్ముడగుచున్న గ్రంధము అది. అనేక గ్రంధములు వస్తు పోతూనే ఉంటాయి గాని బైబిలు మాత్రం మార్పులేనిదై యున్నది.

లేఖనములు అంత గొప్పవి ఎందుకంటే అవన్నియు దేవుని ఆత్మ ప్రేరణ వలన వ్రాయబడినవి. దానిలోని ప్రతిమాట దైవావేశముచే లిఖించబడెను. దానిలోని ప్రతిమాట దైవికము అందు వలన దానిలోని ఏమాటగాని, ఏభాగము గాని కల్పితమని భావించనక్కర్లేకుండా దానినంతటిని మనం విశ్వసించవచ్చును. "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21). అపొ.పౌలు కూడ పేతురువలె ఇట్లు చెప్పుచున్నాడు. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజన కరమైయున్నది" (2 తిమో 3:16-17). గనుక దేవుని వాక్యమును సంశయించక దానిని విశ్వసించు. బైబిలులోని ఏ వాక్యమును శంకించినా, దానినంతటిని శంకించిన యట్లేయగును.

ప్రతి లేఖనము దైవావేశముచే కలిగినందున, దానిని అట్లే గౌరవించ

వలెను. దానికి కలుపుటకుగాని, దాని నుండి తీసివేయుటకు గాని మానవునికి అధికార మీయబడలేదు. దానికి బదులుగా వేరొకటి యుంచుటకుగాని అనుమతి ఇయ్యబడలేదు. నిజానికి దానిని గూర్చి యోహానుద్వారా దేవుడిట్లు హెచ్చరిక జారీచేసారు: "ఈగ్రంధమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా – ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల ఈ గ్రంధములో వ్రాయబడిన తెగుళ్ల దేవుడు ానికి కలుగజేయును. ఎవడైనను ఈ ప్రవచనగ్రంధమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంధములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలులేకుండ చేయును" (ప్రకటన 22:18-19). అపో.పౌలు కూడ ఇట్లు చెప్పుచున్నాడు: "మేమిదివరకు చెప్పిన ప్రకారమిప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్త గాక మరి యొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్థుడవును గాక" (గలతీ 1:9). గనుక దేవుని వాక్యము విషయములో మనం కడుజాగ్రత్తకలిగి యుండాలి. లేనియెడల కలుగుపరిణామములు తీవ్రమైనవి.

దేవుని వాక్యము శక్తివంతమైనది దానిని నమ్మి, లోబడువారందరినీ రక్షించుశక్తిగలది అది (యోహాను 8:32; 17:17). అది ఒకని ఆత్మను రక్షించుటయేగాక, అతనిని వెలుగు మార్గములో నడిపించును. రాబోవు లోకమునకు అతని ఆత్మను సిద్ధపరచును (కీర్తన 119:105; ప్రక 22:14).

బైబిలు సర్వావస్థలయందు ప్రయోజనకరమైనది. దుఃఖములో యున్న వానిని అది ఓదార్చును, నిరుత్సాహములో యున్న వానికి ప్రోత్సాహమిచ్చును. బలహీనుని బలపరచును. నశించిన వానికి నిరీక్షణనొసగును. ఎవనికైనా ఏ అవుసరముండినా, గ్రంధములకు గ్రంధమైన బైబిలు దానికి జవాబు నిచ్చును. మానవుడెక్కడినుండి వచ్చాడో, ఇక్కడ ఎందుకు వున్నాడో, ఎక్కడికి వెళ్లుచున్నడో లేఖనములు మనకు తెలియజేయుచున్నవి. బైబిలు మానవునికి మార్గదర్శిగా, దిక్సూచిగా పనిచేయుచున్నది.

దేవుని వాక్యము నిత్యము నిలుచును అది ఎన్నడు గతించదు. ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు" అని యేసు చెప్పెను (మత్తయి 24:35). చివరిగా, బైబిలు మనకు

తీర్పుతీర్చును. యేసు ఇట్లు చెప్పారు. "నన్ను నిరాకరించి నామాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడుకలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహా 12:45).

నా మిత్రుడా, దేవుని వాక్యమును విశ్వసించుము. దానిని నీ అనుదిన సహచరిగా చేసికొనుము. దానికి లోబడి నీజీవితములో దానిని ఏలదీయుము. అది నిన్ను ఈలోకములోను, రాబోవు లోకములోను కూడ ఆశీర్వాదించును. దేవుని వాక్యము నిత్యము నిలుచునని గుర్తుంచుకొనుము, ఒకానొక దినమందు అది లోకమునకు తీర్పుతీర్చును దేవుని వాక్యము రక్షించగలదు, గాని అది ఖండించగలదు కూడ!

- జె.సి. ఛోట్

## బైబిలు నిజమా ?
## (Is the Bible True?)

"ప్రవచనము ఎప్పుడును మనుష్యు ని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యు లు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడిన వారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21).

**నేను బైబిలును నమ్ముదును :**

బైబిలును విశ్వాసము వలన నేనంగీకరింతును, నేను మరణానంతరము జీవించుదునని అది బోధించుచున్నది. నేనొక శ్రేష్టమైన గృహమునకు వెళ్ళ దలచుకొంటిని, నాకంటె ముందు వెళ్ళి పోయిన మిత్రులను, బంధవులను కలసి కొనవలెనని నేననుకొనుచుంటిని. బైబిలు నిజమని నా చిన్న తనమునుండి నాకు బోధింపబడినది. గతంలోయున్న గొప్ప పురుషులు బైబిలును అంగీకరించిరి. దానిని నమ్మకుండుటకంటే, నమ్ముటయే సులువు.

**నేను దేవుని నమ్ముదును:**

నాస్తికత్వము నిరూపింప ఒక లేదు. దేవుడు లేదని తెలిసికొనుటకు ఒకడు సమస్తమును ఎరిగియుండ వలెను. దేవునియందు నమ్మిక యుంచుట చాల యోగ్యమైనది. దేవుడు లేడని నమ్ముట చాల అయోగ్యమైనది. ఆయన ఉనికిని గూర్చి ఈ విశ్వమే సాక్ష్యమిచ్చుచున్నది. ప్రతి యిల్లును ఏదైనా ఒకనిచే నిర్మింపబడి యున్నది. గడియారమును తయారు చేసిన జ్ఞాని అంటూ ఒకడున్నాడు. దేవుడు చేసిన వాటిని బట్టి దేవుని గూర్చి మన మెరుగుదుము. ఆకారమును, ప్రకృతిని మరియు ఒక పసిబిడ్డ ముఖమును ఒకసారి తిలకించి దేవుని పరికించుము. దీని యంతటి వెనుక ఒక గొప్ప

నమూనాకారుడు (Designer) సాంకేతిక విజ్ఞానకోవిదుడు ఉన్నాడు. ఇట్టి విశ్వాసము లేకపోతే దీని గత్యంతరము ఏమిటి? నిరీక్షణ శూన్యము, జీవించుటకు గల లక్ష్యము సున్న. అది ఎంత భయంకరమైన నిర్జీనమైన దృశ్యమో!

దేవుని చూపించు, నేను నమ్ముదును అని చెప్పుచు కొందరు వాదించుదురు. నీ మెదడు చూపించు, అప్పుడు నీకు కొంత మెదడున్నదని నమ్ముదును! గాలిని చూపించు అపుడు దానిని నమ్ముదును. మహాత్మగాంధిని చూపించు అప్పుడాయన్న జీవించాడని నేను నమ్ముదును. మనము ప్రాణాన్ని గాక దాని ఫలములను చూచుచున్నాము. అట్లే నీ మెదడు యొక్కయు, గాలియొక్కయు, గాంధి యొక్కయు పనిని మనము చూడగల్గుచున్నాము. దేవుడు చేసిన వాటిని బట్టి మనమాయనను చూడగల్గుదుము. ఆయన ఉనికిని గూర్చిన ఋజువులను ప్రతిచోట మనము చూచుచున్నాము.

కాలారంభము నుండి నిత్యత్వము వరకు బైబిలు మన మార్గదర్శియై యున్నది (కీర్త 119:105). అది ఎన్నడు నాశనము గావించబడదు (మత్తయి 24:35). ప్రతి సత్కార్యమునకు అది సంపూర్ణమైయున్నది (2 తిమో 3:16). అది దేవుని నుండి కలిగినది (హెబ్రీ 1:1,2). అది మానవుని ఆద్యంతములను, అతని కృషిని, గమ్యమును బయలు పరచుచున్నది. మరో గ్రంధమేదియు వీటిని బయలు పరచలేదు. అది కాల పరీక్షలను జయించినది. వోల్టయర్. పేయిన్, ఇంగెరుసాల్ లాంటి వ్యక్తులు దానిని నాశనము చేయబూని విఫలు లైరి.

బైబిలు 40 మంది లేఖకులచే 1600 సంవత్సరములలో వ్రాయబడెను. అది ఒకే సంపుటియైనను దానిలో 39 పుస్తకములు గల పాత నిబంధన, 27 పుస్తకములు గల క్రొత్త నిబంధన యున్నది. దాని లేఖకులలో రాజులు, గొల్లలు, సైనికులు, జాలరులు, వ్యవసాయకులు కలరు. అది రాజభవనములలోను, గొల్లల గుడారములలోను, చెరసాల గదులలోను వ్రాయబడెను. బైబిలు లేఖకులు అందున్న వ్యక్తుల మంచి చెడులను రెంటిని గూర్చి తెలియ చేసిరి. అబ్రాహాము, నోవహు, దావీదు, మోషే పేతురులాంటి వారిని గూర్చి ఉదాహరణగా ఆలోచించుము. ఆయా వ్యక్తులలో ఎన్ని వ్యత్యాసములున్నను బైబిలు అంతయు ఒకేగ్రంధమైయున్నది. దానిలో స్వవిరుద్ధ సంగతు లేమీ లేవు.

దాని నైతిక ప్రభావము దేశ దేశాలకు ప్రబలియున్నది. నాగరికత పయనించవలసిన త్రోవను అది

చూపించినది. మానవ స్వాతంత్ర్యమునకు మద్దతు ఈయబడినది. కృషియే గౌరవమనే సంగతి గుర్తించబడినది. కళా సాహిత్యము లు, విద్య మొదలగునవి విస్తరించబడెను. దీనియంతటికిని తప్పక ఒక కారణముండ వలెను. అదేమంటే బైబిలు దేవుని నుండి కలిగెను !!

**బైబిలు రక్షణ సంకల్పమును బయలు పరచున్నది :**

"మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందు చున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" (1 కొరింథీ 15: 21-22). అది ఏదేను నుండి ఆరంభమై పరదైసు వరకు చెప్ప బడుచున్న కథ. అది కథలన్నిటికంటే ప్రఖ్యాతిగాంచినట్టిది. అది మర్త్యుడగు మానవుడు ముందెన్నడు విననట్టి గొప్ప వర్తమానము. క్రీస్తురక్తము ఇమిడి యున్న ఈకథలో మానవుడు రక్షింపబడ వలెనంటే విశ్వాసముంచ వలెనని (యోహా 8:24), మారుమనస్సు పొందవలెనని (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనవలెనని (రోమా 10:10), మరియు బాప్తిస్మము పొందవలెనని బయలు పరచబడియున్నది (అ.కా. 2:38).

**తీర్పుతీర్పు స్థాయి అది :**

"మరియు గొప్పవారేమి కొద్ది వారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రకట 20:11,12). ఆ దినమందు ఒక్కొక్కరి పేరు పిలువ బడుచుచుండగా మనందరము అక్కడ యుందుము. ఇప్పుడు బైబిలులో ఏమి వ్రాయబడియున్నదో అపుడు కూడ అదే వ్రాయబడి యుండును. దాని పరిశుద్ధ ఆజ్ఞలయెడల మనకున్న భావమును బట్టి మనందరి నిత్య గమ్యము నిర్ణయించబడును.

బైబిలు దాగలి వంటిది. గత సాయం సమయమున కంసాలవాని గుమ్మము దగ్గరనుండి వెళ్ళుచు వాని దాగలి నుండి వచ్చుధ్వనిని వింటిని. లోపలికి తొంగి చూచి అనేక సంవత్స రముల కాలమునుండి వాడబడి అరిగిపోయిన సుత్తెలు నేలమీద పడి యుండుట చూచితిని 'ఇన్ని సుత్తెలను పడగొట్టుటకు నీవు ఎన్ని దాగళ్ళు (anvils) వినియోగించితివి? యని నేనతనిని అడిగితిని'. 'ఒకే ఒక్కటి! దాగలి సుత్తెలను అరుగగొట్టి పడ

గొట్టును కదా' యని అతడు ప్రశ్నించు చూపుతో జవాబిచ్చెను. అట్లే దేవుని వాక్యమనే దాగలిపై సందేహశీలురి దెబ్బలు తరములబడి పడుచునే యున్నవి. పడుచున్న దెబ్బల శబ్దము వినబడుచున్నను, దాగలికి హాని యేమి యును కలుగలేదు. గాని సుత్తెలు పడిపోయెను అని నేనను కొంటిని".

**బైబిలులో......**

బైబిలులో దేవుని చిత్తము, మానవుని స్థితిచ రక్షణ మార్గము, పాపుల నాశనము, విశ్వాసుల సంతోష ము బయలు పరచబడి యున్నవి. దాని బోధ పరిశుద్ధమైనది. ధర్మవిధులు బద్ధమైనవి. దాని చరిత్రలు యదార్థము లు, దాని నిర్ణయములు స్థిరములు. జ్ఞానిపగుటకు దానిని చదువుము, సురక్షితుడవగుటకు దానిని విశ్వసిం చుము. పరిశుద్ధుడవగుటకు దానిని పాటించుము. నిన్ను నడిపించుటకు దానిలో వెలుగు. పోషించుటకు ఆహారము. సంతోష పెట్టుటకు ఆదరణయు ఉన్నది. అది ప్రయాణీకుని మార్గదర్శి, యాత్రికుని దండము, నావికుని దిక్సూచి, సైనికుని ఖడ్గము, క్రైస్తవుని రాజశాసనము. దానిలో పరలోకము తెరువబడెను. నరక ద్వారములు కనుపరచబడెను. క్రీస్తుదాని గొప్ప అంశము, మన మేలు దాని సంకల్పము మరియు దేవుని మహిమయే దాని ధ్యేయము. అది మన మనస్సులో నింపబడవలెను, హృదయమును ఏలవ లెను. మన పాదములను నడిపించ వలెను.

దానిని నెమ్మదిగా, జాగ్రత్తగా, ప్రార్థన పూర్వకముగా చదువుము. అది సంపదలగని, ఆత్మకు ఆరోగ్యము, ఆనంద నది. అది ఇక్కడ ఈ జీవితంలో నీకీయబడినది, తీర్పులో తెరువ బడును మరియు నిత్యము స్థిరముగా యుండును. దానిలో అత్యున్నతమైన భాధ్యత, అత్యుత్తమ పరిశ్రమకు ఫలితము ఇమిడి యున్నవి. మరియు దాని విషయము లను అలక్ష్యము చేయు వానినది ఖండిం చుచున్నది.

- జార్జి డిహోఫ్

**గమనిక:**

**సత్యవాక్కు సాలు చందా మీరు ఇంకను పంపని యెడల వెంటనే పంపించండి. మీ బంధు మిత్రులు ఈ పత్రిక చదివేలాగున ప్రోత్సహించండి.**

**- ఎడిటర్**

# బైబిలు గ్రంథకర్త యెవరు -1 ?
# (Who is the Author of the Bible-1 ?)

బ్రహ్మాండమైన ఈ విశ్వము వెనుక నున్న గంభీరవ్యక్తి దేవుడని మనము ఎరుగవలసి యున్నది. సృష్టికంతకును కర్తయైనవాడు బైబిలుకు గ్రందకర్తయో కాదో నిర్ణయించుటకు ఈ రోజు ప్రయత్నిం చెదము.

దైవావేశము కలిగిన మనుష్యులచే లిఖింపబడినట్లా రోపింపబడిన 66 పుస్తక ముల కలయికయైన బైబిలు మనకున్నది. అన్ని గ్రంథములకు వలె దీనికి ఒక గ్రంథ కర్త యున్నాడనేనది అందరూ అంగీకరిం చినదే. అయితే ఆ గ్రంధకర్త యెవరు? మానవుడా? లేక దేవుడా? బైబిలు మిత్రులు దేవుడే దానికి గ్రంధకర్తయని, ఆయన మనుష్యులతో పరిశుద్ధాత్మాద్వారా మాటలా డగా వారు దానిని లిఖించిరని నమ్ముదురు. అయితే కొందరు అది దైవప్రేరితమైనది కాదని దాని లేఖకులు వారి కాలమందలి ఆచారములను వారి ఉద్దేశములను మాత్రమే అందు వ్రాసిరని, బైబిలు చెప్పు అనేక సంగతులు కట్టుకథలని చెప్పుచు, వారు దానియందున్న అద్భుతములను కూడా నిరాకరింతురు.

అది దైవ ప్రేరితమైనదని బైబిలు చెప్పుకొనుచున్నది. అది దేవుని వాక్యమై యున్నదని చెప్పుకొనుచున్నది. మోషే వ్రాసిన వ్రాతలన్నిటిలో దేవుడు అవన్ని యును (అతనికి) వివరించి చెప్పెనని మనక తెలియజేయుచున్నది (నిర్గమ 20:1). మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెను (నిర్గమ 24:4). "అవన్నియును యెహోవా ఆజ్ఞాపించిన విధులు" (నిర్గమ 35:1).

"యెహోవా ఆత్మ నా ద్వారా పలుకుచున్నాడు ఆయన వాక్కు నా నోట ఉన్నదని" దావీదు చెప్పెను (2 సమూయేలు 23:2).

"యెహోవా మాటలాడుచు న్నాడు ఆకాశమా, ఆలకించుము; భూమీ చెవియొగ్గుము'' అని యెషయా చెప్పెను (యెషయా 1:2).

''యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై" యీలగు సెలవిచ్చెను. యిర్మీయా 1:4).

"యేసుక్రీస్తు తన దాసులకు కనపరచుటకు దేవుడతని కనుగ్రహిం చిన ప్రకటన లేక ప్రత్యక్షతను" అతడు వ్రాసెనని యోహాను చెప్పెను(ప్రక1:1).

''ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశు ద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని

మూలముగా పలికిరి" (2 పేతురు 1:21) అని పేతురు నుడివెను.

అఖరిగా, అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాసిన పత్రికలోని సంగతిని గమనించుదము: "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియ జెప్పుచున్నాను. మనుష్యుని వలన దానిని నేను పొందలేదు, నాకెవడును దాని బోధింపను లేదుగాని యేసుక్రీస్తు బయలు పరచుట వలననే అది నాకు లభించినది" (గలతీ 1:11,12).

బైబిలు లేఖకులు దానికి గ్రంధకర్తలమని ఇసుమంతయును చెప్పుకొనక వారి వ్రాతలన్నియును దైవా వేశముచే కలిగినవని చెప్పుటలో ఏకమై యున్నారు. అది అంతయును బైబిలుకు అనుకూలముగా భావించబడిన సంగతు లేయని అంగీకరించినను, మిగతా వాదమంతటిని పైన చెప్పబడిన ఆరోపణల మీద మాత్రము మేముంచుట లేదు. బైబిలు వ్యతిరేకులతో సహృదయత కలిగి యుండుటకు, బైబిలు గ్రంధకర్తలు మానవులు మాత్రమే యని వారు చెప్పు కొన్ని సూత్రములను పరిశీలించుట కొరకు ఒక ప్రశ్నను వేయుదము. మనుష్యులు దానిని వ్రాసిరా?

అయితే ఏ తరగతివారు ? ఆత్మీయ నైతిక సూత్రములను బట్టి మానవలోక మంతయును సజ్జనులు దుర్జనులు, నీతిమంతులు అనీతిమంతులని రెండు విధములుగ చేయనగును. అందుచే ఏ తరగతి మనుష్యులు దానిని వ్రాసిరి? అని మరల ప్రశ్నింపనగును. సజ్జనులు దానిని వ్రాసిరా? దానిని నిజముగా సజ్జనులే వ్రాసినట్లయితే వారు బైబిలు ద్వారా లోకమంతటిని స్పష్టముగా మోసగించిరని నిష్పక్షపాతియైన ప్రతి అవిశ్వాసియు తెలిసికొనగలడు. నైతికముగా అది అసాధ్యమని కూడ గ్రహించగలడు. సజ్జనులు అబద్ధమాడ గలరా? లేక అబద్ధికులు సజ్జనులు కాగలరా?

బైబిలును వ్రాసినవారు దుర్జ నులా? అవిశ్వాసులు ఇక్కడ కూడ సందిగ్ధా వస్థలో పడవలసి వచ్చు చున్నది. ఏదైనా ఒక సంగతి బైబిలు నందు స్పష్టముగా నిలిచియుంటే, అది పాపము యెడల దాని అసమాన ద్వేషమే. పాపమును అసామాన్య పదములతో అది ఖండించుచు దానిని జరిగించు వారి శిక్షను అది ఖచ్చి తముగా చెప్పుచున్నది. పాపము యెడల దాని స్వభావమును తెలిసి కొనుటకు క్రిందనీయ బడిన రెండు వాక్యములు సరిపోగలవు: "యెహోవా కు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు -

అవేవనగా అహంకార దృష్టియు కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" (సామె 6:16-19). "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము:" (ప్రకటన 21:8).

ఒక ప్రశ్న : ఈ గ్రంధమును వ్రాసినవారు ఎంత దుర్మార్గులైనను, వారు చేయుపాపములను ఖండించుచు, వాటివలన కలుగు కఠిన శిక్షను గూర్చి అందు వ్రాయగలరనుట యోగ్యమా? ఈ ప్రశ్నలోనే దాని జవాబు ఇమిడి యున్నది. దుర్మార్గులు బైబిలును వ్రాసియుండలేరనియు, సన్మార్గులు దానిని వ్రాసి సన్మార్గులవలే యుండలేరనియు మనము చూచితిమి. దైవ ప్రేరేపణ లేక వ్రాయబడిన అనేక సంగతులతో బైబిలును సరిపోల్చి చూచిన అందు గొప్ప భేదము కన్పించును. బైబిలు గ్రంధకర్తలు మానవులే యని చెప్పుసిద్ధాంతములను అది కూలద్రోయుచున్నది. బైబిలును మనము అభివృద్ధి చేయలేము, దానికి సాటియైన దానిని సమకూర్చలేము.

దైవావేశము కలమునకు యోహాను స్వస్తి చెప్పి ఇంచు మించు 2 వేల సం॥లు కాబోవుచున్నది. బైబిలును అలనాటి మానవులే వ్రాసియుండిన యెడల, నేడు మానవులనుభవించు చున్న అనేక సదుపాయములను బట్టి నేటి మానవులు మరింత మంచి బైబిలును వ్రాసియుండవలసినది గదా. కీ.శే. విల్లియం జెన్నింగ్స్ బ్రాయన్ అనునతడు చెప్పిన ఒక సంగతిని ఈ సందర్భములో చూచుకొందము.

"మానవ అంతస్థులను బట్టి నిర్ణయించిన యెడల బైబిలు వ్రాయబడిన కాలముకంటే నేడు మానవులు దానిని వ్రాయుటకు ఎంతో అభివృద్ధి చెంది యున్నారు. ఎవరి మాటలు, చేతలు బైబిలునందు వ్రాయబడెనో, ఆ వ్యక్తులందరూ ఒకే జాతికి చెందినవారు. నేడు మన దేశములకంటె ఏమంత పెద్దది కాని ఒక దేశములో పాలస్తీనా కొండలలో వారు నివసించిరి. వారికి అచ్చు యంత్రములు లేవు. విశ్వ విద్యాలయములులేవు. చదువు కొనుటకు గొప్ప గొప్ప గ్రంధాలయాలు వారికి నాడు లేవు. భూ నలుమూలలు నుండి వార్తలనందించుటకు టెలిగ్రాఫ్ తీగలు, వార్తా పత్రికలను వారెరుగరు. పైన నక్షత్రములలోను, క్రింద బండలలోను

గల రహస్యములను బయలు పరచుట కానాడు శాస్త్రమింకను తన ప్రకృతి తలుపులను తెరవనే లేదు. నేటి అమిత విజ్ఞాన వికాసమును బట్టి చూస్తే అతి మిక్కిలి సంకుచితమైన విజ్ఞాన గృహము నుండి వారు ఆయా సంగతులను గ్రైకొనినను, ఈ బైబిలు వ్యక్తులు ప్రపంచ సృష్టి జరిగిన నాటినుండి సమాధి అనంతరపు మానవజాతి సంగతుల వరకు అన్నిటిని గూర్చి చెప్పుచున్నారు. మానవుని జననము నుండి మరణము వరకు గల ఒక చిత్రపటమును వారు మనకిచ్చి యున్నారు. ఆ మార్గమందున్న ప్రతి అపాయకరమైన స్థలమును గూర్చి మనకు చూపుడు బల్లల నుంచి యున్నారు. జాతీయచట్టమునకు పునాది వలే బైబిలునందలి "పది ఆజ్ఞలను", ఆత్మీయ సూత్రములకు "క్రీస్తు కొండ మీద ప్రసంగమును" మనము తప్పక అంగీకరించి వాటి సహాయమును గ్రైకొనుచున్నాము.

"నిర్దేవులును, నాస్తికులును వారికి సాధ్యమైతే మనకున్న బైబిలు కంటే శ్రేష్ఠమైన బైబిలు తయారు చేయగలరేమో చూద్దాం. వారి బదులలో నున్న మేధావులనందరినీ వారి నేర్పుచు కొననిమ్ము. వారి ప్రత్యేక సభ్యులు చూడదగిన స్థలములను చూడనిమ్ము. గ్రంథాలయములను పరిశోధింపనిమ్ము. వారిని జీవ, వృక్ష, జంతు, రసాయనిక, భౌతిక, భూగర్భ శాస్త్రములు మొదలగు వానినన్నిటిని పరిశోధింప నిమ్ము. కళలలోను, సాహిత్యములోను, చరిత్ర లోను గల అభివృద్ధినంతటిని వారిని గ్రైకొననిమ్ము. ఆయా శాఖలలోని విజ్ఞాన సార మంతటితోను ఒక గ్రంథమును తయారుచేసి దానిని బైబిలుకు బదులుగా వారిని లోకమునకీయనిమ్ము! బయలు దేవతా ప్రవక్తల వంటి విశ్వాసము వారికి గలదా? అసలు వారాలాగున ప్రయత్నిం చగలరా? లేని యెడల వారేమని సాకు చెప్పగలరు ? మానవుడు 2వేల సంవత్స రముల క్రితమతడున్నట్టి స్థాయినుండి క్రిందికి పడిపోయెనా? లేక మానవుని కంటే ఉన్నతమైన స్థావరము నుండి బైబిలు మనకు లభించెనా? ఇందులో ఏమి?

– జాషువా గూటం

# సంక్షిప్త వార్తలు

2015 ఏప్రియల్ 7,8,9 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలం జగన్నాధగిరిలో బహిరంగ సువార్త కూటములు నిర్వహించబడెను. ఆ కూటములకు జగన్నాధగిరిలో యున్న క్రీస్తు సంఘముదరపున సోదరులు పులగల విల్లియంకేరీ దంపతులు సారధ్యము వహించిరి. రెండవరోజు రాత్రి జాషువా గూటం గారు సతీసమేతంగా హాజరై వాక్యపరిచర్యచేసిరి. మూడు రోజులు ప్రజలు పెక్కు సంఖ్యలో హాజరై సత్యవాక్యమునాలకించిరి. స్థానిక సంఘము వచ్చిన వారందరికీ భోజనములు ఏర్పాటుచేసిరి.

2015 ఏప్రియల్ 10వ తేదీ శుక్రవారం నాడు విశాఖపట్టణం గాజువాకలో యున్న విశాఖ వేలీ బైబిలు కాలేజీ యొక్క మూడవ పట్ట ప్రదాన కార్యక్రమము నిర్వహించబడెను. విశాఖ వేలీ బైబిలు కాలేజీ సోదరులు యమ్. సామ్యూల్ రాజు (బిక్కవోలు) అధ్వర్యమున నడిపించబడుతున్నదను వాస్తవమును పాఠకులు ఎరిగినదే ఆ దినమందు అమెరికా నుండి వచ్చిన జెర్రీబేట్స్ గారు, ఆయన సతీమణి పాలబేట్స్ గారు ముఖ్య అతిధులుగా విచ్చేసి 12 మంది విద్యార్ధులకు పట్ట ప్రదాన కార్యక్రమమును జరిగించిరి. సోదరులు జాషువా గారు సతీసమేతముగా హాజరై సందర్భానుసారమైన చక్కటి బైబిలు ఉపన్యాసము నందించిరి. బైబిలు శిక్షణను పూర్తి చేసిన వారికి ముఖ్యఅతిధులు చేతులమీదుగా బైబిలు నిఘంటువులు, సువార్త సంబంధిత పుస్తకములు అందించబడెను. విశాఖ వేలీ బైబిలు కాలేజీ డీన్ గారైన సోదరులు జాన్‌డీన్ గారి నిర్విరామ కృషివలన ఆ రోజు కార్యక్రమమంతా విజయవంతముగా జరిగెను. పట్టణ ప్రముఖులతో సహా వందలాదిమంది హాజరుకాగ, వచ్చిన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. జాన్‌డీన్ గారి వందన సమర్పణతోను, ముగింపు ప్రార్ధనతోను నాటి కార్యక్రమము ముగిసెను.

2015 ఏప్రియల్ 11వ తేదీ రాత్రి కోటిపల్లి కోటలో యున్న క్రీస్తు సంఘము నిర్వహించిన సువార్త కూటములో జెర్రీబేట్స్ దంపతులు హాజరుకాగా, అపో. పౌలు క్రైస్తవునిగా మార్పుచెందిన విధానమును ఆయన వర్ణించిరి. అనేకమంది హాజరై గొప్ప సహవాస అనుభూతిని పొందిరి. అక్కడ సోదరులు విజయభాస్కర్ గారు క్రీస్తు కొరకు మంచి పనిచేయుచున్నారు.

2015 ఏప్రియల్ 13వ తేదీ సోమవారం నర్సీపట్నం సమీపములో ఉన్న కొడవటిపూడిలో యున్న క్రీస్తు సంఘము ఏర్పాటుచేసిన సువార్త కూటములో జెర్రీబేట్స్ దంపతులు, రిక్కీగూటం గారు పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. 14వ తేదీన తూర్పుగోదావరి జిల్లా పోతుకూరులోను వారు వాక్యపరిచర్య చేసిరి.

2015 ఏప్రియల్ 29వ తేదీనాడు రిక్కీగూటం గారు సతీసమేతముగాను కూమారుడు జస్టిన్ గూటం గారితోను అమెరికా బయలుదేరనున్నారు. వారి కొరకు ప్రార్థించమనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St. Kakinada - 533 004